నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, సోమవారం 5 ఆగస్టు 2024 | PEDDAPALLI

చెవిలో పువ్వుతో నేతన్నల నిరసన

గర్శకుర్తిలో చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

గంగాధర, ఆగస్టు 4 : వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం ఆర్డర్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గర్శకుర్తి గ్రామ పవర్‌లూమ్స్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా ఆదివారం చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరెల ఆర్డర్లు నిలిచిపోయాయని, ఎనిమిది నెలలుగా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాంచాలను నమ్ముకున్న తమ కుటుంబాలు వస్త్రోత్పత్తి లేక వీధిన పడుతున్నాయని ఆందోళన చెందారు. ప్రభుత్వం స్పందించి వస్త్రోత్పత్తి ఆర్డర్లు కల్పించి తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

'కాళేశ్వర గంగ.. పరవళ్లు తొక్కంగ


రామడుగు మండలం గాయత్రీ పంపుహౌస్‌లో డెలివరీ సిస్టర్న్ నుంచి ఉబికివస్తున్న గోదావరి జలాలు

- నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో నిరంతరం పంపింగ్
- లింక్-2లో ఎల్లంపల్లి నుంచి మధ్య మానేరుకు ఉరకలు
- ఇప్పటికే 9.8 టీఎంసీల చేరిక

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 4: కాళేశ్వర గంగ ఉప్పొంగుతున్నది. లింక్-2లో ఎత్తిపోతలతో దిగువన ఎల్లంపల్లి నుంచి ఎగువన మధ్యమానేరు జలాశయానికి పరవళ్లు తొక్కుతున్నది. ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్ హౌస్‌లో నాలుగు మోటర్లు (2,3,5,7) నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 చొప్పున 12,600 క్యూసెక్కులు డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడి నంది రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. ఈ రిజర్వాయర్ 10 గేట్లను ఎత్తడంతో గ్రావిటీ కాల్వ ద్వారా జంట సొరంగాలకు చేరి అక్కడి నుంచి 7, 8 ప్యాకేజీలలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్ హౌస్‌కు తరలిపోతున్నాయి. అక్కడి నుంచి సైతం నాలుగు మోటర్లు (1,3,4,5) ద్వారా 12,600 క్యూసెక్కులు లిఫ్ట్ చేస్తుండగా, డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసిపడ్డ జలాలు సుమారు 5.7 కిలోమీటర్లు ఉన్న గ్రావిటీ కాలువ ద్వారా ప్రవహించి వరదకాలువలో 99వ కిలోమీటర్ మైలురాయి వద్ద కలుస్తున్నాయి. అక్కడి నుంచి మధ్య మానేరుకు పరుగెడుతున్నాయి. ఆదివారం వరకు సుమారు 9.8 టీఎంసీల గోదారి జలాలను మధ్య మానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు డీఈఈ రాంప్రదీప్ తెలిపారు. కాగా, ఎత్తిపోతల ద్వారా పెద్దఎత్తున వరద వచ్చి చేరుతున్న నేపథ్యంలో మధ్య మానేరులో నీటి మట్టం గంట గంటకు పెరుగుతోంది. పూర్తి నీటి సామర్థ్యం 27.054 టీఎంసీలుకాగా, ప్రస్తుతం 15.18 టీఎంసీలు ఉంది.

మూగబోయిన సాంచాలు

- బతుకునిచ్చే 'బతుకమ్మ'పై సర్కారు కక్ష
- ఆర్డర్లకు ఎగనామం.. చీరెల పంపిణీ రద్దు!
- ఉపాధిలేక ఆగమవుతున్న కుటుంబాలు
- ఇప్పటికే తుక్కుకింద రెండు వేల మగ్గాల అమ్మకం
- ఆదుకోవాలని కొన్ని రోజులుగా కార్మికుల నిరసనలు
- మళ్లీ మొదలైన నేతన్నల వలసలు.. ఆత్మహత్యలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

సంక్షోభంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ

సిరిసిల్ల మరమగ్గం ఆగిపోయింది. నాలుగు నెలలుగా పనిలేక మూగబోయింది. గత బీఆర్ఎస్ సర్కారు పాలనలో కార్మికులకు చేతినిండా పని, పనికి తగ్గ కూలీతో పదేండ్లుగా బతుకు చూపిన వస్త్ర పరిశ్రమ కాంగ్రెస్ సర్కారు పట్టింపులేమితో సంక్షోభంలో కూరుకుపోయింది. వేలాది మందికి బతుకునిచ్చిన బతుకమ్మపై కక్షగట్టి, ఆర్డర్లు ఇవ్వకపోవడంతో ఉపాధి లేకుండా పోగా, నేతన్నల జీవితాల్లో మళ్లీ అంధకారం అలుముకుంటున్నది. ఇప్పటికే రెండు వేల సాంచాలు తుక్కుకింద అమ్మేసినా, ఆదుకోమంటూ అర్థించినా, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో 2014 నాటికి ముందున్న పరిస్థితే పునరావృతమవుతున్నది. ఓ వైపు కొన్ని కుటుంబాలు ఉపాధి కోసం మళ్లీ భీవండి, ముంబాయి, సూరత్‌కు వలస వెళ్లాల్సిన పరిస్థితి రాగా, మరోవైపు మనసు చెదిరి, బతుకు భారమైన నేతన్నల ఆత్మహత్యలతో సిరిశాల మళ్లీ ఉరిశాలగా మారుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, కార్మిక క్షేత్రానికి మళ్లీ పూర్వవైభవం తేవాలని డిమాండ్ వినిపిస్తున్నది.

రాజన్నసిరిసిల్ల, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాక ముందు ఉమ్మడి ప్రభుత్వంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోయింది. ఉపాధి కరువై, బతుకు భారమై, కుటుంబాలను పోషించలేక సుమారు 700మంది కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. సాంచాలలో చావుకేకలు, ఆకలి చావులతో ఉరిసిల్లగా మారిన సమయంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే. అన్నమో రామచంద్రా..? అంటూ అర్థించినా, పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాలను ఆదుకున్న పాపాన పోలేదు. 'చావులు పరిష్కారం కాదు.. నేతన్నలు ఆత్మహత్య చేసుకోకండి' అంటూ గోడలపై పోలీసులు రాసిన రాతలను ఆనాడు తెలంగాణ ఉద్యమంలో భాగంగా సిరిసిల్లకు వచ్చిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చూసి చలించి పోయారు. అప్పులు పుట్టక మైక్రో ఫైనాన్స్‌ల ఉచ్చులో చిక్కుకుని విలవిల లాడుతున్న నేతన్నలకు నేనున్నానంటూ ముందుకొచ్చారు. రూ.50 లక్షలు పోగు చేసి సిరిసిల్ల పద్మశాలీ ట్రస్టుకు అందజేసి, కార్మికులకు వడ్డీ లేకుండా ఇవ్వాలని ట్రస్టు నేతలకు సూచించారు. తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని విధాలుగా ఆదుకుంటానని ఇచ్చిన మాటకు కట్టుబడి బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చి అండగా నిలిచారు. బతుకమ్మ చీరెలకు వినియోగించే నూలుకు పది శాతం సబ్సిడీ కార్మికులకు చెందేలా చేశారు. ప్రతి సంవత్సరం కోటి చీరెల తయారీతో ఏడేండ్ల కాలంలో సుమారు ఆరున్నర కోట్ల చీరెలు సిరిసిల్లలో తయారయ్యాయి. సిరిసిల్లలో 30వేల సాంచాలుండగా, అందులో 20వేల సాంచాలపై బతుకమ్మ చీరెలు రూపుదిద్దుకున్నాయి. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించింది. ఒక్క సిరిసిల్ల కార్మికులే కాకుండా ఒడిశా, మహారాష్ట్ర, సూరత్, ముంబాయి, షోలాపూర్, భీవండీ, తెలంగాణలోని వరంగల్, జనగామ, సూర్యాపేటతోపాటు ఇతరజిల్లాల నుంచి కార్మికులు సిరిసిల్లకు వలస వచ్చి ఉపాధి పొందారు. ఒక్కో కార్మికుడు నెలకు రూ.25 వేల దాకా సంపాదించారు.

దీనితోపాటు నూలు సబ్సిడీతో ఒక్కో కార్మికుడు ఏడాదికి రూ.30వేల నుంచి రూ.50 వేల లబ్ధిపొందారు.

ఆడబిడ్డకు పండుగ చీరల్లేవు

గత కేసీఆర్ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా బతుకమ్మ చీరను అందిస్తూ రాగా, ఈ యేడు కాంగ్రెస్ సర్కారు ఆ ఆనందం లేకుండా చేసింది. బతుకమ్మ చీరల పంపిణీని రద్దు చేసింది. గత ప్రభుత్వం నేతన్నల కోసం అమలు చేసిన పథకాలన్నింటినీ పక్కన పెట్టి నేతన్నలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలంటూ ఆందోళనలు చేస్తున్నా నేతన్నల పట్ల సవతి ప్రేమ చూపిస్తున్నది. గతంలో కన్నా మెరుగైన ఉపాధి కల్పిస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలిచ్చిన మంత్రులు మొహం చాటేశారు. ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వక పోవడం వల్ల ఇప్పటికే రెండు వేల సాంచాలు తుక్కు కింద ఇనుప సామగ్రికి అమ్మేశారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభం ఇతర వ్యాపార రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. వేలాది మందికి పనిలేక పోవడంతో వ్యాపార, వాణిజ్యం మందగించింది. పరిస్థితి రోజు రోజుకూ దిగజారుతున్నది. ప్రభుత్వం స్పందించక పోతే సంక్షోభం ముదిరి పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉన్నది.

బతుకమ్మనే బతుకునిచ్చింది

2014కి ముందు ఉమ్మడి ప్రభుత్వంలో సిరిసిల్ల ఆగమైంది. సాంచాలలో సంక్షోభం వచ్చి, చాలా మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నరు. స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చి ఆదుకున్నరు. మళ్లీ వస్త్ర పరిశ్రమ పునర్జీవం పోసుకుని ముందుకు సాగింది. ఇంకా బతుకమ్మ చీరెల తయారీతో చేతినిండా కార్మికులకు పని దొరికింది. ఆత్మహత్యలు, ఆకలి చావులు ఆగిపోయాయి. ఒక్క సిరిసిల్లకే కోటి చీరెల ఆర్డర్లను ఇచ్చి, బతుకుదెరువు చూపిస్రు. కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమపై చిన్నచూపు చూస్తోంది. ఆర్డర్లను బంద్ చేసింది. మళ్లీ పాత రోజులు వస్తున్నయి. ఉపాధి లేక ఎన్నో కుటుంబాలు రోడ్డునపడుతున్నయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి.

- గాజుల నారాయణ వస్త్ర ఉత్పత్తి దారుడు, సిరిసిల్ల

రెండు లక్షల చీరెలు తయారు చేశాం

గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరెల వల్ల మా పరిధిలోని మ్యాక్స్ సొసైటీలో వంద సాంచాలపై ఏడేండ్లలో రెండు లక్షల బతుకమ్మ చీరెలు తయారు చేసినం. ఒక్కో కార్మికుడు నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల దాకా కూలీ పొందాడు. అలాగే, బతుకమ్మ చీరెలకు వినియోగించే నూలు సబ్సిడీ, త్రిఫ్ట్ పథకం, బీమా సౌకర్యాలు, విద్యుత్ సబ్సిడీ ఇవ్వడం వల్ల మరమగ్గాల పరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కింది. తెలంగాణ జిల్లాలే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాది మంది వచ్చి ఇక్కడ పని చేసుకుంటూ బతికారు. బతుకమ్మ చీరెలతోనే సిరిసిల్లకు 'సిరి' వచ్చిందని చెప్పవచ్చు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆదుకోకపోతే సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమ కనుమరుగయ్యేది.

- బొడ్డుల సుదర్శన్ మరమగ్గాల యజమాని, సిరిసిల్ల

బువ్వ పెట్టింది బతుకమ్మ చీరెలే

పదేండ్ల కింద సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి, కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిచావులతో ఉరిసిల్ల అయ్యింది. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరెలే మా నేతన్నలకు బువ్వ పెట్టాయి. ఏడేళ్ల కాలంలో ప్రతి సంవత్సరం కోటి చీరెల తయారీతో నేతన్నలు చేతి నిండా పని, పనికి తగ్గ వేతనం పొందారు. పదిశాతం యారన్ సబ్సిడీ నేరుగా నేతన్నల ఖాతాలో జమయ్యాయి. రందీ లేకుండా బతికారు. కానీ, కాంగ్రెస్ సర్కారు నేతన్నలను పట్టించుకోకపోవడం, ఆర్డర్లు ఇవ్వకపోవడంతో మళ్లీ ఆకలికేకలు మొదలవుతున్నాయి. కుటుంబాలు వలసపోతున్నాయి. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి.

- బీకే రాజు వస్త్ర ఉత్పత్తిదారుడు, సిరిసిల్ల

ఆర్డర్లు ఇవ్వాలి..

దశాబ్దాల ఉమ్మడి ప్రభుత్వ హయాంలో ఏనాడూ నేతన్నల జీవన ప్రమాణాలు మెరుగు పడలేదు. 2014లో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పెద్ద ఎత్తున కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలు జరిగినా అండగా నిలువ లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చి ఆదుకున్నది. 30 వేల సాంచాలున్న సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమపై వేలాది మంది కార్మికులకు చేతి నిండా పని కల్పించింది. కార్మిక కుటుంబాలు సంతోషంగా బతికాయి. ఇప్పుడు ఈ కాంగ్రెస్ సర్కారు వచ్చి మళ్లీ పొట్టకొడుతున్నది. అనేక పథకాలను రద్దు చేస్తున్నది. వెంటనే ప్రభుత్వం స్పందించి నేతన్నను ఆదుకోవాలి. వస్త్రోత్పత్తి ఆర్డర్లు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

- మూషం రమేశ్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

రోడ్డుపై వరి నాట్లు వేసి.. నిరసన తెలిపి

కొండపల్కలలో రోడ్డుపై వరి నాట్లు వేస్తున్న గ్రామస్తులు, నాయకులు

మానకొండూర్ రూరల్, ఆగస్టు 4 : మానకొండూర్ మండలం చెంజర్ల నుంచి పచ్చునూర్ వరకు రోడ్డు గుంతలమయం కావడంతో ఆదివారం కొండపల్కలలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్ ఆధ్వర్యంలో గుంతల్లోని నీటిలో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ చెంజర్ల, గంగిపల్లి, కొండపల్కల, మద్దికుంట, పచ్చునూర్ గ్రామాల మీదుగా నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారని, రోడ్డు గుంతలుగా కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలకులకు కనువిప్పు కావాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జనగామ శంకర్ గౌడ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బండి సంపత్ ముదిరాజ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అసలే మూలమలుపు.. ఆపై గుంతలు!

పెద్దపల్లి కమాన్: రహదారిపై ఏర్పడ్డ గుంతతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

పెద్దపల్లి-మంథని ఫ్లై ఓవర్ బ్రిడ్జి మూల మలుపు పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గుంతలు ఏర్పడగా, నిత్యం బస్సులు, లారీలు, వ్యాన్లు ఇతర వాహనాలు నడుస్తుండడంతో పెద్దవిగా మారాయి. దీంతో అధికారులు గుంత ముందు భాగంలో బారికేడు పెట్టి మరమ్మతు చేయకుండానే వదిలేశారు. పలు సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు గుంతను సరిగా గమనించక అందులో పడి గాయపడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే మరీ ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-పెద్దపల్లి కమాన్, ఆగస్టు 4

నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

- వారికి వెంటనే ఉపాధి కల్పించాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు

దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించి నేతన్నలకు ఉపాధి కల్పించాలని సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేతన్నలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరెల తయారీతో నేతన్నలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. ఒకప్పుడు తయారైన వస్త్రాలు ప్రైవేటు వాళ్ల చేతులోకి వెళ్లడంతో వస్త్ర పరిశ్రమ పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆర్డర్ల పైనే ఆధార పడిందని, తద్వారా రూ.కోట్ల వస్త్ర విలువైన ఉత్పత్తులు రూ.లక్షల్లో పడిపోయాయన్నారు. ప్రభుత్వం వస్త్ర పరిశ్రమను రాజకీయ కోణంలో చూడకుండా నేతన్నల ఉపాధిని దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆర్డర్లు ఇచ్చి అండగా నిలువాలని కోరారు. నేతన్నల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ యథాతథంగా కొనసాగించాలని కోరారు. మరమగ్గాలకు ఇస్తున్న విద్యుత్ నాలుగో కేటగిరీ నుంచి మూడో కేటగిరీలోకి మార్చడం వల్ల యూనిట్ ధర రూ.2 నుంచి రూ.8.50కు పెరిగిందన్నారు. ఇది ఆసాములకు మోయలేని భారగంగా మారిందని తెలిపారు. కార్మికులు కోరుతున్న విధంగా 10 హెచ్‌పీల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఆయన వెంట లాల్‌బావుటా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పంతం రవి, సీపీఐ నాయకులు గుంటి వేణు, జేఏసీ నాయకులు తాటిపాముల దామోదర్, వెల్దండి దేవదాస్, ఎనుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్‌లో ఈ-స్టోర్

- పేపర్ విధానానికి స్వస్తి
- ఇకపై స్టోర్ లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే..
- సమయం ఆదాతోపాటు త్వరితగతిన పనులు

.ముకరంపుర, ఆగస్టు 4 : ఎన్పీడీసీఎల్ వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నది. తాజాగా, విద్యుత్ శాఖ చేపట్టే పనులకు అవసరమైన మెటీరియల్‌ను వెంటనే జారీచేసేలా ఈ-స్టోర్ విధానాన్ని అమలు చేస్తున్నది. దీంతో ఇప్పటి వరకు ఉన్న పేపర్ విధానానికి స్వస్తి పలికి.. ప్రతి లావాదేవీని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తూ వేగవంతమైన సేవలు అందించేందుకు ముందుకు సాగుతోంది.

ఈ-స్టోర్ పనితీరిలా

విద్యుత్ శాఖ వినియోగదారులకు గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక కనెక్షన్లు ఇవ్వడంతోపాటు ఇతర పనులు చేపడుతూ ఉంటుంది. అయితే, ఈ పనులకు అవసరమైన మెటీరియల్ జిల్లా స్టోర్ నుంచి జారీ చేస్తారు. ఇది వరకు ఈ ప్రక్రియ అంతా పేపర్ రూపంలో నిర్వహించి, సంబంధిత అధికారుల పరిశీలన, ఆమోదం కోసం ఫైళ్లను పంపించాల్సి వచ్చేది. పాత పద్ధతిలో కొంత జాప్యం జరిగేది. కాగా, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఈ-స్టోర్ విధానంతో తిప్పలన్నీ తప్పనున్నాయి. కొత్త పద్ధతిలో సంబంధిత సెక్షన్ ఏఈ ప్రతిపాదిత పనికి కావాల్సిన మెటీరియల్ స్టాక్‌ను స్టోర్‌లో అందుబాటులో ఉందో లేదో సాప్(SAP) సాఫ్ట్ వేర్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పరిశీలించి, అవసరమైన మెటీరియల్‌ను రిజర్వు చేస్తారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్ సమాచారం ఎస్ఏపీ వర్క్ ఫ్లో ద్వారా సంబంధిత ఏడీఈ స్టోర్‌కు ఆన్‌లైన్‌లో వెళ్తుంది. పనులకు అవసరమైన మెటీరియల్ తీసుకొనే అధికారి మెటీరియల్ తీసుకోవడానికి ఏ రోజు స్టోర్‌కు రావాలో ఆ తేదీ, సమయాన్ని ఎస్ఎంఎస్, ఎస్ఏపీ మెయిల్ రూపంలో సమాచారం వెళ్తుంది. నిర్ణీత సమయానికి సంబంధిత అధికారి స్టోర్‌కు వెళ్లి మెటీరియల్ తీసుకొని పనులు ప్రారంభించాల్సి ఉంటుంది.

పేపర్ లెస్‌తో సమయం ఆదా

కొత్త విధానంలో అంతా పేపర్‌లెస్‌గానే పని జరుగుతుంది. దీంతో సమయం ఆదా కావడంతో పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసే వీలుంది. ఇంతకు ముందు మ్యానువల్ విధానంలో పనికి కావాల్సిన మెటీరియల్ లిస్ట్‌ను ప్రింట్ తీసుకొని, వాటిపై సంతకాలు తీసుకొని ఆ ఫైల్‌ను సంబంధిత అధికారికి అందచేసి సామగ్రిని తీసుకోవాల్సి వచ్చేది. ఈ విధానంలో కొంత జాప్యం, మెటీరియల్ సకాలంలో అందక పనులు పూర్తి చేసేందుకు సమయం పట్టేది. ఈ సమస్యను అధిగమించడానికే సీఎండీ వరుణ్‌రెడ్డి ఈ-స్టోర్‌కు రూపకల్పన చేయగా ఎస్పీఏపీ బృందం రూపొందించింది.

సులువుగా మెటీరియల్ బదలాయింపు

ఏదయినా ఓ పనికి సంబంధించిన మెటీరియల్ మిగిలి ఉంటే వేరొక పనికి వినియోగించేలా ఆన్‌లైన్‌లోనే సులువుగా మార్చుకొనే వెసులుబాటు ఉంది. ఈ పద్ధతిలో సమయం కలిసి రానుంది.

సాంకేతికతతో త్వరితగతిన పనులు

అందుబాటులోకి వచ్చిన ఈ-స్టోర్ సాంకేతికతతో వినియోగదారులకు త్వరితగతిన సేవలు అందించే వీలుంది. మెటీరియల్ సమాచారంతో పాటు జారీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ఈ విధానంతో విద్యుత్ శాఖకు, వినియోగదారులకు మేలు చేకూరనుంది.

- వడ్లకొండ గంగాధర్, ఎస్ఈ-కరీంనగర్ సర్కిల్

ఇదేం అణిచివేత..?

- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కులేదా
- ఖనిలో క్వార్టర్స్ బాధితుల ఆగ్రహం
- సత్యాగ్రహ దీక్షను అడ్డుకున్న పోలీసులు

పోలీసుతో వాదన చేస్తున్న తోటవేణు

గోదావరిఖని, ఆగస్టు 4: 'ఇదేం అణిచివేత, జరుగుతున్న అన్యాయంపై నిరసన తెలిపే హక్కు ఈ ప్రజాస్వామ్యంలో లేదా..? సత్యాగ్రహ దీక్షను అడ్డుకోవడం సరికాదంటూ' పోలీసులపై క్వార్టర్స్ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గోదావరిఖని పట్టణంలోని లక్ష్మీనగర్‌లో 82 సింగరేణి క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి కార్మిక కుటుంబాలు కొంత కాలంగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆదివారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో సత్యాగ్రహ దీక్ష నిరసన చేపట్టగా,అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆందోళకారులకు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా క్వార్టర్స్ పోరాటపక్ష నాయకుడు తోటవేణు మాట్లాడారు. నిరసన తెలుపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, దీక్షను అడ్డుకోవం సరికాదన్నారు. దీక్షకు నాలుగు రోజుల క్రితం అనుమతులకు మీ సేవలో దరఖాస్తు చేశామని, పోలీసులు ఉద్దేశపూర్వకంగానే అనుమతిపై జాప్యం చేశారని ఆరోపించారు. దాదాపు రెండు గంటల పాటు గందరగోళం నెలకొనగా, అదనపు పోలీసు బలగాలు రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. దీక్ష అనుమతిపై పోలీసులు ఏ నిర్ణయం తీసుకోకపోతే తాను హైకోర్టును ఆశ్రయిస్తానని తోటవేణు తెలిపారు. దీక్షను వాయిదా వేసిన అనంతరం మౌన ప్రదర్శనగా నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక్కడ మాదాసు లక్ష్మయ్య, పోతరాజు, భాస్కర్, నరసింహారాజు, రమేశ్, శంకర్, శ్రీనివాస్, జావేద్, దేవా, వెంకటేశ్, కిరణ్, జీ పాషా, ఠాగూర్, దబ్బెట సతీశ్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, శ్యామ్, రామస్వామి ఉన్నారు.